ఆంధ్రజ్యోతి


*** రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్: 4.40 (గురువారం)

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 3 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.2

భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అడుగుల లోతు బోర్లు వేసినా చుక్క నీరు రావడంలేదు. ఇప్పటికే చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఒట్టిపోయాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల్లో నీరులేక అడుగు కన్పిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రెండు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. సాగునీటికి ఇలా ఉంటే ఇక తాగునీటి పరిస్థితి ఏమిటని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



ఎండుతున్న బత్తాయి మొక్కలు

జలం.. పాతాళం



ఎండిన బోరుబావి

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పండ్లతోటలకు నీరందక అవస్థలు
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం
- తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు

భూగర్భజలాల మట్టాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. సాగునీటికే కాదు, తాగునీటికీ గండం రాబోతోంది. సాగునీటి కొరతతో ఇప్పటికే జిల్లాలో యాసంగి పంటలను రైతాంగం నష్టపోగా, తాజాగా పండ్ల తోటల పరిస్థితి ఎలా అన్న ఆందోళన రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న సుమారు 70వేల ఎకరాల బత్తాయి, 13వేల ఎకరాల నిమ్మతోటలకు భూగర్భజలాలే ఆధారం కావడం, బోర్లలో నీరు ఎండిపోతుండడంతో పండ్లతోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మిషన్‌భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు ఢోకాలేదని, జూన్ నెలాఖరువరకు తాగునీటి సరఫరాకు అవసరమైన నీరు నీటిసోర్సుల వద్ద అందుబాటులో ఉందని, అయినప్పటికీ జిల్లాలో వేసవిలో సాధారణ వినియోగానికి ఉపయోగించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక కూడా జిల్లాలో రూ.5.25కోట్లతో అధికారులు చేపట్టారు. చేతి పంపులు, గ్రామపంచాయతీల మోటర్లు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తున్నారు. మరోవైపు జిల్లాలో మిషన్ భగీరథకు నీటి ఇబ్బందుల్లేకుండా చూసే ఉద్దేశ్యంతో సోమవారం నుంచి నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా తాగునీటికోసం 2,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటితో రిజర్వాయర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నింపడం ద్వారా సోర్సులకు నీటికొరత లేకుండా పోతుందని అధికారులు చెబుతున్నారు.

అడుగుంటుతున్న భూగర్భజలాలు

జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. సగటున జిల్లాలో 11.31 మీటర్ల లోతుకు భూగర్భజలాలు మార్చి నెలాఖరుకే పడిపోవడం ఆందోళన కలిగించే అంశం. గతేడాది ఇదే సమాయనికి 7.77 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భజలాలు ఈ సారి 3.54 మీటర్ల అదనపు లోతుకు పడిపోవడం గమనార్హం. గతేడాది మేలో సైతం 7.84 మీటర్ల లోతులోనీరు లభ్యమైతే, ఈ సారి ఏప్రిల్ మొదటికే తీవ్రస్థాయికి పడిపోగా, రాబోయే రోజుల్లో మరింత లోతుకు భూగర్భజలాలు పడిపోయే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు. వినియోగం భారీగా ఉంటుండడంతోపాటు, వర్షపాతం తగ్గడం, చెరువుల్లో నీరు లేకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి తలెత్తిందని అంచనా వేస్తున్నారు. పండ్ల తోటలు అధికంగా ఉన్న దేవరకొండ, నల్లగొండ డివిజన్లలోనే భూగర్భజలాలు అత్యధికంగా పడిపోవడంతో పండ్లతోటలకు నీటి ఇబ్బందులు నెలకొన్నాయి.



జిల్లాలో అత్యధికంగా భూగర్భజలాలు పడిపోయిన మండలాలు

జిల్లా సగటు	11.31 మీటర్లు
చందంపేట	18.25 మీటర్లు
చిట్యాల	17.40 మీటర్లు
నేరేడుగొమ్ము	15.53 మీటర్లు
నాంపల్లి	13.50 మీటర్లు
కేతేపల్లి	13.51 మీటర్లు
నల్లగొండ	12.11 మీటర్లు
కట్టంగూరు	11.88 మీటర్లు
అనుముల	11.83 మీటర్లు
నార్కట్‌పల్లి	11.82 మీటర్లు
చండూరు	11.65 మీటర్లు
పెద్దవూర	11.60 మీటర్లు
మర్రిగూడ	11.35 మీటర్లు
తిప్పర్తి	11.26 మీటర్లు
గట్టుప్పల	11.16 మీటర్లు
అడవిదేవులపల్లి	10.46 మీటర్లు
నిడమనూరు	10.31 మీటర్లు

పండ్లతోటలు దక్కించుకోవడానికి రైతాంగం అవస్థలు



జిల్లాలో నల్లగొండ, దేవరకొండ డివిజన్లలో అత్యధికంగా, మిర్యాలగూడ డివిజన్‌లో నాన్‌ఆయకట్టు ప్రాంతంలో విస్తరించిన బత్తాయి, నిమ్మతోటలకు వేసవిలో నీటిగండం ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 70వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో నిమ్మ తోటలు విస్తరించి ఉన్నాయి. ఈ తోటలన్నింటికీ భూగర్భజలాలే ఆధారమవడం, నీటిమట్టాలు అడుగంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నల్లగొండ డివిజన్‌లో పండ్లతోటల రైతులు పెద్దసంఖ్యలో బోరుబావుల తవ్వకాలు చేపట్టారు. దాదాపు 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వుతున్న పరిస్థితి ఈ ప్రాంతంలో నెలకొంది. గుర్రంపోడు, నల్లగొండ, కనగల్లు, తిప్పర్తి తదితర మండలాల్లో పండ్ల తోటల రైతులు వేరే పొలాలల్లోని బోరుబావుల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా తరలిస్తూ తోటలకు అందించాల్సి వస్తోంది. ఇప్పటికే నీరు సరిపడా లేక తోటలు వాడిపోతున్నాయని, ఇంకో రెండునెలలపాటు ఈ అవస్థలు తప్పవని, పంట కోల్పోవడంతోపాటు, ప్రధాన తోటలను కొంతమేర నష్టపోవాల్సి వస్తుందనే ఆందోళనను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

మత సామరస్యంతో కలిసి మెలిసి ఉండాలి

- శాసన మండలి చైర్మన్ గుత్తా



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి


నల్లగొండ, ఏప్రిల్ 2: మత సామరస్యంతో కలిసి మెలిసి ఉండాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పోలీస్ ఆడిటోరియంలో గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్‌లో పాల్గొని మాట్లాడారు. ఇఫ్తార్‌లో రాజకీయాలకతీతంగా ప్రతీఒక్కరు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మౌలానా బషీరొద్దీన్, హఫీజ్‌ఖాన్, మౌలానా హీలాల్, మహ్మద్ నభీ, హుస్సేన్, ఆనీష్ ముక్తాదీర్, ఫరీద్, జమాల్, అహ్మద్ ఖలీల్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ సీట్లను కైవసం చేసుకుని, లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు అధికార కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. గత వైభవా న్ని చాటుకునేందుకు బీఆర్ఎస్, తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో అన్ని ప్రధాన పార్టీ లు కూడా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మద్దతు ఇవ్వరూ!

- పార్టీల్లోని సీనియర్ నేతలతో అభ్యర్థుల సంప్రదింపులు
- ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై సమాలోచనలు
- సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు



నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డిని, బీఆర్ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థులుగా ఆయా పార్టీలు ప్రకటించాయి. భువనగిరి స్థానంలో కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం తరఫున ఎండీ జహంగీర్‌ను ప్రకటించాయి. అయితే ఎంపీ అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో సీనియర్ నేతలతోపాటు పార్టీలోని కీలకనేతల మద్దతు కోసం తిప్పలుపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు జిల్లాలోని మంత్రులు, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సంప్రదిస్తున్నారు. వారిని కలిసి ఎన్నికల్లో తమకు పూర్తి సహకారాన్ని అందించాలని, గెలుపు వ్యూహాలపై సమాలోచనలు కూడా చేస్తున్నారు. పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కృషి చేయాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనాల జోరు



ప్రధాన పార్టీ అభ్యర్థులు సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కులాలవారీగా గర్జనలకు సిద్ధమవుతున్నాయి. భు వనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం(రంగారెడ్డిజిల్లా), జనగాం(జనగాం జిల్లా) నియోజకవర్గా లు ఉంటాయి.నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలున్నాయి. బీజేపీ ఎస్సీ సామాజిక వర్గాల ఓటర్లను సాధించేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి, పార్లమెంట్ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సైతం ఆత్మీయ సమ్మేళనాలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నియోజకవర్గాల వారీగా పెద్దఎత్తున సమావేశాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే తేదీలను ఖరారు చేయనుంది. ఇక బీఆర్ఎస్ ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు నిర్వహించగా, ప్రత్యేకంగా సామాజికవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అన్నిప్రధాన పార్టీలు కూడా మెజార్టీ ఓటర్లపై దృష్టి సారించాయి. మెజార్టీ సామాజిక వర్గాలు తమవైపే ఉన్నారన్నభావనలో పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఎవరివైపు మొగ్గుచూపుతారో అన్నది వేచిచూడాల్సిందే.

సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసం

ఎన్నికలకు నెలరోజుల ముందుగానే పార్టీల్లోని టికెట్ ఆశించిన నేతలతోపాటు అసంతృప్త నేతలను కూడా కలిసి వారి మద్దతు కోరుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు టికెట్ నిర్ణయం జరిగిందని, ఈఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసంగా ఉంటుందని విన్నవించుకుంటున్నారు.ఇక బీజేపీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. నిత్యం ఏదో ఒక నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లను తమవైపు తిప్పుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. అవసరమైతే జాతీయస్థాయి నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. ఇక బీఆర్ఎస్ అధిష్ఠానం నియోజకవర్గాలవారీగా సమావేశాలు పూర్తిచేసింది. ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని అసెంబ్లీల నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పర్యటించారు. పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మెజార్టీ స్థానాల గెలుపు కోసం అన్ని పార్టీలు కూడా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలు

పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 2: ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎలాంటి సమస్యలు రాకుండా లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం ఆమె జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లోక్‌సభ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించబడిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులనుద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికలను సజావుగా నిర్వహించే కీలక బాధ్యత ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులపై ఉంటుందని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి, సీసీ కెమెరాలు, భద్రతపై నల్లగొండ ఆర్డీవోకు పలు సూచనలుచేశారు. నాగార్జున కళాశాల మైదానంలో ఏర్పాటు చేయబోయే డీఆర్సీ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. నల్లగొండ ఆర్డీవో రవి, ఎన్నికల శిక్షణా కార్యక్రమ నోడల్ అధికారి, వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, స్థానిక తహసీల్దార్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

లోక్‌సభ ఎన్నికల శిక్షణా తరగతులకు గైర్హాజరైన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలకు కలెక్టర్ హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమానికి మొత్తం 4,740 మంది పీవో, ఏపీవోలు హాజరు కావాల్సి ఉండగా, 4,064మంది మాత్రమే హాజరయ్యారని, 676 మంది శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైనట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన సిబ్బందికి 3వ తేదీన తిరిగి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

త్రిపురారం: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అంతకుముందు పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందస్తు అనుమతి లేనిదే సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకుని ర్యాలీలు నిర్వహించే తేదీ, ప్రారంభం సమయం, స్థలం, రూట్, ముగింపు సమయాన్ని అందులో పొందుపర్చి అనుమతి తీసుకోవాలన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన గంజాయి, కల్తీ కల్లు నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్బీ డీఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సైదా, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు వెంకటయ్య, సైదులు, మహాలక్ష్మయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.25వేల పరిహారం ఇవ్వాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్ ● అధికారులకు వినతి

నల్లగొండ, ఏప్రిల్ 2: రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు రూ.25వేల నష్ట పరిహారంతోపాటు ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్యతోపాటు పలువురు నాయకులు డీఆర్వో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేసి విలేకర్లతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు రైతులకు అండగా నిలబడటానికి ఉద్యమ బాట పట్టినట్లు తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తేవడానికి తాము కలెక్టరేట్‌కు వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడం విచాకరమన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని అధికారులు మాత్రం ప్రజల తరఫున ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే సాగునీరు లేకపోవడంతోపాటు విద్యుత్ నిర్వహణలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్ల ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రు నాయక్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కరీంపాషా, వంగాల సహదేవ్‌రెడ్డి, అలకుంట్ల నాగరత్నంరాజు, దోటి శ్రీనివాస్, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, నారబోయిన భిక్షం, వెంకన్న, వెంకట్‌రెడ్డి, దేవేందర్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, యాదయ్య, జనార్ధన్‌రావు పాల్గొన్నారు.



డీఆర్వో రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాటక రంగాన్ని రక్షించుకోవాలి

- రంగస్థల నటులు రంగాచార్యులు, శంకర్




విశ్వామిత్ర నాటక ప్రదర్శనిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 2: నాటకరంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ రంగస్థల నటులు రంగాచార్యులు, అడవి శంకర్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక కళాకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న నందినీ జాతీయస్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు కార్యక్రమాలను వీరు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావంతో నాటక రంగంపై తగ్గుతున్న ఆదరణ ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ రంగంలో సేవలందిస్తున్న కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరమెంతో ఉందని, ప్రేక్షకులు కళలను పెంచి పోషించాలన్నారు. నాటకరంగంపై అభిమానంతో కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రముఖ నృత్యకారుడు మారెళ్ల వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రనాట్యం ఆకట్టుకుంది. అంతకుముందు ప్రముఖ కళాకారుడు దాసి సుదర్శన్ మృతికి సాంస్కృతిక కళా కేంద్ర సభ్యులు సంతాపం తెలిపారు. సీతారాంపురంలో సుదర్శన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాకేంద్ర వ్యవస్థాపకుడు తడకమళ్ల పూర్ణచందర్, అధ్యక్షుడు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, గ్యార సాయిలు, పరిమి రామావతారం, మామిడాల ఉపేందర్, పయ్యావుల శ్రీనివాసరావు, రాం రంగారావు, బాబురావు, రాఘవయ్య పాల్గొన్నారు.

నేటినుంచి 'పది' జవాబుపత్రాల మూల్యాంకనం

● నల్లగొండకు 2లక్షలకు పైగా జవాబుపత్రాలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ ● ఈ నెల 11వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ



నల్లగొండ, ఏప్రిల్ 2: రాష్ట్ర విద్యాశాఖ ఈ సారి పదో తరగతి ఫలితాలను సకాలంలో వెల్లడించేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంను సకాలంలో చేపడుతోంది. గత నెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రధాన పరీక్షలు 30వ తేదీతో ముగియగా, ఒకటి రెండు ఒకేషనల్ పరీక్షలు ఈ నెల 2వ తేదీతో ముగిశాయి. పరీక్షలు ముగిసిన నేపథ్యంలో జవాబుపత్రాల ముల్యాంకనానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చకచక సాగుతున్నాయి. జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేదీన అంటే బుధవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేపట్టింది. కేవలంలో తొమ్మిది రోజుల్లోనే జిల్లాకు కేటాయించిన జవాబుపత్రాల మూల్యాంకనాన్ని పూర్తి చేయడంకోసం ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాకు 2లక్షలకు పైగా జవాబు పత్రాలు

జిల్లాకు 2లక్షల పైచిలుకు జవాబు పత్రాలను కేటాయించారు. వివిధ జిల్లాలకు చెందిన జవాబు పత్రాలు దాదాపు 95శాతం మేరకు మంగళవారం సాయత్రం వరకు జిల్లాకు చేరాయి. మరో 5శాతం మేరకు తెలుగు మీడియానికి సంబంధించిన సాంఘీక శాస్త్రం జవాబు పత్రాలు బుధవారం సాయంత్రం వరకు చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ జవాబుపత్రాలు పూర్తిగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా జిల్లాకు చేరేలా ఏర్పాట్లు చేశారు. వచ్చిన జవాబు పత్రాలన్నింటికీ ఇప్పటికే కోడింగ్ ప్రక్రియ చేశారు. జవాబుపత్రాలను దిద్దేందుకు సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులను నియమించారు. మొత్తం 600మంది ఉపాధ్యాయులను జవాబు పత్రాలను దిద్దడం కోసం కేటాయించారు. అదేవిధంగా 100 మంది చీఫ్ ఎగ్జామినర్లు, ఏడుగురు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 250 మంది స్పెషల్ అసిస్టెంట్లు ఉంటారు. పదో తరగతి పరీక్షల క్యాంపు అధికారిగా బొల్లారం భిక్షపతి వ్యవహరించనున్నారు. ఇక పోతే జవాబుపత్రాల మూల్యాంకనం ప్రతీ రోజు 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నారు. జవాబుపత్రాల మూల్యాంకనం జరిగే ప్రదేశంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు ఉండనుంది. జవాబుపత్రాల మూల్యాంకనం చేసే వారు లోపలికి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకరావొద్దని అధికారులు ఆదేశించారు. మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండనుంది.

మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మూల్యాంకనం చేయనున్నాం. జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ కూడా చేపట్టాం. జిల్లాకేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం జరగనుంది. ఉపాధ్యాయులు సకాలంలో మూల్యాంకనం కేంద్రానికి చేరుకుని తమకు అప్పగించిన బాధ్యతను త్వరగా పూర్తి చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశాం.

బొల్లారం భిక్షపతి, డీఈవో, నల్లగొండ

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 513.10 అడుగులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 513.10 అడుగులు(136.9932 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 4,881 క్యూసెక్కుల నీటిని, జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.

టోల్‌గేట్లలో గతేడాది చార్జీలే..

● చార్జీల పెంపునకు రెండు నెలల విరామం
● ఎన్‌హెచ్ఏఐ ఆదేశాలతో గతేడాది చార్జీలను కొనసాగిస్తున్న జీఎంఆర్



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

చౌటుప్పల్ / కేతేపల్లి, ఏప్రిల్ 2 : ప్రతీ ఏడాది ఏప్రిల్ 1 ఒకటవ తేదీ నుంచి పెరిగే టోల్‌చార్జీల బాదుడు రెండు నెలలు వాయిదా పడింది. జాతీయ రహదారుల సంస్థ(నాయ్) సూచన మేరకు గతేడాది టోల్‌చార్జీలను కొనసాగించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65)పై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు కూడా టోల్‌ప్లాజా ఉంది. ప్రతీ ఏడాది మాదిరే ఏప్రిల్ 1 నుంచి పెరిగిన చార్జీలను ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి(ఏప్రిల్ 1) వరకు సుమారు 20 గంటల పాటు వసూలు చేశారు. అనంతరం నాయ్ సూచన మేరకు పాతచార్జీలను రెండు నెలల పాటు కొనసాగిస్తూ హైవే డెవలపర్స్ ఆర్గనైజేషన్‌కు నాయ్ మౌలిక ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జీఎంఆర్ సంస్థ పాతచార్జీలను వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం నుంచి వసూలు చేసిన టోల్‌ఛార్జీలను సోమవారం రాత్రి (ఏప్రిల్1)అమల్లోకి తెచ్చినట్లు కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మేనేజర్ శివకుమార్ తెలిపారు.

వాహనాలు రకాలు	పంతంగి టోల్‌ప్లాజా వద్ద		కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద	
	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి
కారు, జీపు, వ్యాన్	రూ.90	రూ.135	రూ.125	రూ.190
లైట్ కమర్షియల్ వెహికల్	రూ.140	రూ.210	రూ.200	రూ.300
బస్, ట్రక్‌లకు	రూ.290	రూ.435	రూ.415	రూ.625
హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనానికి	రూ.450	రూ.675	రూ.645	రూ.970
పెద్ద వాహనానికి సింగిల్	రూ.560	రూ.845	రూ.805	రూ.1,210

ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో 2 వేల ఏళ్ల నాటి నాణేలు





ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో మార్చి 29న తవ్వకాల్లో బయటపడ్డ సీసపు నాణేలు, గతంలో తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధుల కాలం నాటి ప్రతిమలు, స్తంభాలు, ఇతర వస్తువులు

మోత్కూరు, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో నిర్వహిస్తున్న తవ్వకాల్లో తాజాగా మార్చి 29న 2 వేల ఏళ్ల కిందటి సీసపు నాణేలు బయటపడ్డాయి. ఇవి శాతవాహనుల సామంతులైన మహాతలవరుల కాలం నాటి నాణేలుగా భావిస్తున్నారు. క్రీస్తుశకం రెండో శతాబ్దంలో ఇక్కడ బౌద్ధధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని చెబుతారు. ఫణిగిరి కొండపై సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఈ బౌద్ధక్షేత్రం విస్తరించి ఉంది. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన బౌద్ధక్షేత్రాల్లో ఫణిగిరి క్షేత్రం ఒకటి. అమరావతి, నాగార్జున కొండ బౌద్ధక్షేత్రాల కంటే ఈ క్షేత్రం గొప్పదంటారు. ఇక్కడ ఇక్ష్వాకులు 11 ఏళ్లు పరిపాలించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1941లో అప్పటి నైజాం ప్రభువు కాలంలో ఈ క్షేత్రంలో తొలిసారి తవ్వకాలు జరిపారంటున్నారు. ఆ తర్వాత రాష్ట్ర పురావస్తు శాఖ వారు 2001 నుంచి 2007 వరకు ఒకసారి 2015లోనూ ఫణిగిరి గుట్టపై తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో మహాస్థూపం, చైత్య గుహలు, స్థూపాలు, గృహలు, శిలా మండపాలు, బుద్ధుడి పాదాలు, బుద్ధడి ప్రతిమలు, పాత్రలు, చిహ్నాలు, జాతక కథలు, సిద్ధార్థ గౌతమి జీవిత కథలు, అపురూపంగా మల్చిన శిల్పాలు, శాతవాహలు, ఇక్ష్వాకులు, మహాతరవరుల నాణాలు, బొమ్మలు బయటపడ్డాయి. కుండలు, కూజలు, కప్పులు, టైల్స్, బౌద్ధుల గదులు బయటపడ్డాయి. ఇందులో 32 గదులు ఉన్నాయి. బుద్ధుడి పాదాలు, బుద్ధుడి వ్యక్తిత్వానికి ప్రతీకలుగా భావించే అష్టమంగళం, చిహ్నాలు, మర్మచక్రం, మిథునం, అంకుశం, యజ్ఞాశం, ఖడ్గం, సప్తి, పిరస్నం గుర్తులు లభించాయి. ప్రపంచంలో ఎక్కడా లేని బుద్ధుడి తలపాగా ఇక్కడ లభ్యమైందని చెబుతారు. గతంలో ఇక్కడ బుద్ధవనం ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. తరచుగా దేశ, విదేశాల బౌద్ధ మత గురువులు, పురావస్తు పరిశోధకులు, అధ్యయనకారులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. మార్చి 11న ఈ బౌద్ధ క్షేత్రంలో మ్యూజియం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతీ హోళికేరీ, కలెక్టర్ వెంకటరావు పాల్గొన్నారు. ఆ రోజు నుంచి పురావస్తు శాఖ అధికారులు ఇక్కడ మరోసారి తవ్వకాలు చేపట్టారు. రోజూ 65 నుంచి 75 మంది కూలీలు తవ్వకాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగతా రోజుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తవ్వకాల్లో గత నెల 29న 2 వేల ఏళ్ల కిందటి 3,700 సీసపు నాణేలు బయటపడ్డాయి. వాటిని కూలీల సమక్షంలోనే లెక్కించి భద్రపర్చినట్లు తెలిసింది. పురావస్తు శాఖ డైరెక్టర్ వచ్చి పరిశీలించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

రూ.40కోట్లతో బుద్ధవనంలో అభివృద్ధి పనులు



బుద్ధవనంలో రూ.25కోట్లతో నిర్మించే డిజిటల్ మ్యూజియం స్థలాన్ని పరిశీలిస్తున్న రమేశ్‌నాయుడు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టును రూ.40కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ ఎండీ. రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టులో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా బుద్ధవనం ప్రాజెక్టులో రూ.25కోట్లతో డిజిటల్ మ్యూజియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మరో రూ.15కోట్ల వ్యయంతో కొనసాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్, సోలార్ పవర్ ప్లాంట్, సెంట్రలైజ్డ్ మ్యూజియం, వ్యూ పాయింట్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం హిల్‌కాలనీ విజయ్‌విహార్ వెనుక వైపు ఉన్న లాంచీ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి, బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ శివనాగిరెడ్డి, జీఎం ఉపేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నజీశ్, విజయ్‌విహార్ మేనేజర్ ఎల్లస్వామి, సూపర్‌వైజర్ విష్ణు తదితరులు ఉన్నారు.

గుట్టలో క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 35,29,018 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.







మానవతావాది 'దాసి' సుదర్శన్



సుదర్శన్ పార్థివదేహం ఎదుట నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 2 : మానవతావాది, వామపక్ష భావజాలంతో కడదాక ముందుకు సాగిన విలక్షణ, చిత్రకారుడు 'దాసి' సుదర్శన్ అని వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం పిట్టంపల్లి సుదర్శన్ అలియాస్ 'దాసి' సుదర్శన్ పార్థివదేహాన్ని సందర్శించి వివిధ సంఘాల నేతలు, శేషు మిత్రమండలి సభ్యులు నివాళులర్పించారు. సుదర్శన్ సతీమణి స్వతంత్రను పరామర్శించారు. బంధు, మిత్రుల అశ్రునయనాల మధ్య మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, కార్టూనిస్ట్ శంకర్, నర్సిం తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విభిన్న రంగాల్లో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పుస్తక రచయితగా, కార్టూనిస్టుగా, జర్నలిస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా, ఉపన్యాసకుడిగా, చిత్రకారుడిగా, గాయకుడిగా ఆయన ప్రతిభను కనబరిచారని గుర్తు చేశారు. పిట్టంపల్లి సుదర్శన్ దాసి చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసి జాతీయ అవార్డు పొంది 'దాసి' సుదర్శన్‌గా ప్రజలకు మరింత చేరువయ్యారని అన్నారు. పౌరాణిక రంగస్థల నటుడు మట్టయ్య కుమారుడిగా సుదర్శన్ కళలను పుణికి పుచ్చుకున్నాడని అన్నారు. 'అల' అనే కళావేదిక స్థాపించి సాహిత్య సభలను నిర్వహించారని తెలిపారు. కాగా సుదర్శన్‌కు సంతానం లేకపోవడంతో అతడి అన్న కుమారుడు చక్రవర్తి సుదర్శన్ చితికి నిప్పంటించారు. అంత్యక్రియల్లో మానవహక్కుల వేదిక నాయకులు పీ సుబ్బారావు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, నాయకులు యోగానంద్ భిక్షమయ్య, కస్తూరి ప్రభాకర్, రచయితలు వేణు సంకోజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, మధుసూదన్, తిరుమల్‌రావు, ఎలికట్టె శంకర్‌రావు కార్టూనిస్టులు విఘ్నేశ్వరాచారీ(చిత్ర), వడ్డేపల్లి వెంకటేశ్, గుండు శ్రీనివాస్, ఇనుగుర్తి విజయ్, వివిధ సంఘాల నేతలు కిరణ్మయి, జ్వాల వెంకటేశ్వర్లు, చెరుకు సుధాకర్, రవి, రామోహన్‌రాజు, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశ్, పంకజ్, జాడి రాజు, ప్రసాద్, వివిధ పత్రికల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అనాథగా రిక్షా కార్మికుడి మృతి



తిరుమలగిరిలోని ఆదర్శనగర్‌లో యాదగిరి మృతదేహాన్ని ఆటోలోకి ఎక్కిస్తున్న మునిసిపల్ సిబ్బంది, యాదగిరి (ఫైల్ ఫొటో)

తిరుమలగిరి, ఏప్రిల్ 2: నాలుగేళ్ల క్రితం భార్య మృతి చెందింది... రెండేళ్ల క్రితం కుమార్తెకు వివాహమై అత్తవారింటికి వెళ్లింది. రెక్కల కష్టం మీద రిక్షా తొక్కుతూ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇంట్లోనే కిందపడగా, సకాలంలో ఆయనను ఆసుపత్రికి తరలించేవారులేక ప్రాణాలు కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరిగినా ఎవరూ గుర్తించలేదు. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల ఇళ్లవారు వెళ్లి చూడటంతో ఈ ఘటన వెలుగు చూసింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరిలోని ఆదర్శనగర్ 3వ వార్డుకు చెందిన పులుసు యాదగిరి(50) రిక్షా కార్మికుడు. భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా, కుమార్తె రేణుక రెండేళ్ల క్రితం తిరుమలగిరికి చెందిన వెంకన్నను ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో యాదగిరి తన చిన్న ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆ వీధిలో నాలుగైదు ఇళ్లు మాత్రమే ఉంటాయి. అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉండే కుమార్తె అప్పుడప్పుడు తండ్రి వద్దకు వచ్చి బాగోగులు చూసుకుంటుంది. భారీకాయుడైన యాదగిరి ఇంట్లో కిందపడటంతో తల పగిలి రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించేవారులేక మృతి చెందాడు. మంగళవారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు యాదగిరి ఇంట్లోకి వెళ్లి చూడగా కింద పడి మృతిచెందినట్లుగా గుర్తించి కుమార్తెకు సమాచారమిచ్చారు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నందున దగ్గరకు ఎవరూ వెళ్లలేదు. యాదగిరి మృతదేహాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, కార్మికులు అంజి, సాల్మన్, చేత రాములు దుప్పటిలో చుట్టి మునిసిపల్ వాహనంలో శ్మశానవాటికకు తరలించారు. కుమార్తె, అల్లుడు సమక్షంలో మునిసిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతను తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టి మానవత్వం చాటారు. యాదగిరి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియల క్రతువు నిర్వహించింది. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి మునిసిపల్ సిబ్బందికి రూ.5వేల విలువైన పీపీఈ కిట్లు, కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

సాగర్ మాజీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సీజ్





భగత్ క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న అధికారులు, 14వ మైలురాయి వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ క్యాంపు కార్యాలయాన్ని ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఇంట్లో ఉన్న సామాన్లన్నింటినీ మునిసిపల్ వాహనాల్లో ఎన్నెస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం గేటుకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ విషయంపై ఎన్నెస్పీ ఈఈ మల్లిఖార్జున్‌రావును వివరణ కోరగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఇంతకాలం నివాసమున్న భవనం తన సొంత ఇల్లు కాదని, క్యాంపు కార్యాలయంగా తమ రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయాన్ని అప్పగించేందుకు పలుమార్లు భగత్‌ను క్యాంప్ ఆఫీస్‌ను ఖాళీ చేయాలని నోటీసులు పంపినా ఆయన పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయాన్ని సీజ్ చేసి గేటుకు తాళం వేశామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దవూర తహసీల్దార్ పావని సరోజ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, జేఈ బిక్షమయ్య, సీఐ వీసన్న, ఎస్ఐ సంపత్ ఉన్నారు. కాగా హైదరాబాద్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎన్నెస్పీ అధికారులు తాను నివాసం ఉంటున్న ఇంటిని సీజ్ చేశారని అన్నారు. ఈ విషయంలో చట్టపరంగా ముందుకు వెళ్తానని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా

సాగర్‌హిల్‌కాలనీలోని తన క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ హైదరాబాద్ నుంచి హుటాహుటిన సాగర్‌కు బయలుదేరారు. ఆయన్ను మార్గమధ్యలో పోలీసులు 14వ మైలురాయి వద్ద అరెస్టు చేశారు. అరెస్టు విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు హిల్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పొదిలి శ్రీను, భానునాయక్, మల్లికార్జునతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తుండటంతోనే

నల్లగొండ, ఏప్రిల్ 2: ప్రభుత్వం కేటాయించిన అధికారిక క్యాంపు కార్యాలయాన్ని సకాలంలో ఖాళీ చేయకపోవడమే కాకుండా, లోకసభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నప్పటికీ క్యాంపు కార్యాలయాన్ని రాజకీయ కార్యక్రమాలకు వినియోగించుకున్నందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు హిల్ కాలనీలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయాన్ని తక్షణమే సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.21.58 లక్షల
నగదు పట్టివేత

వలిగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, కోదాడ రూరల్, నాగారం, తిప్పర్తి, ఏప్రిల్ 2: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 21,58,069 రూపాయల నగదును మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాసు శివకుమార్ తన బైక్‌పై రూ.5,04,569 నగదును తరలిస్తుండగా వలిగొండ మండలం నాగారం మధిర గ్రామం కమ్మగూడెం వద్ద తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో అమ్మనబోలు గ్రామానికి చెందిన వ్యాపారి తన బైక్‌పై సుంకి వెంకటేశ్వర్లు రూ.9.50లక్షల నగదును తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. చిట్యాల మండలం వట్టిమర్తి స్టేజీ వద్ద నిర్వహించిన తనిఖీల్లో హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తున్న వాహనంలో ఎలాంటి ఆధారాలు లేని రూ.2.39లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.55 వేల నగదు పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో పత్తి వ్యాపారి షేక్ సైదా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో బొలెరో వాహనంలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలాపురం గ్రామానికి చెందిన ఎల్లబోయిన బుచ్చయ్య నుంచి రూ.80వేలు, అదేవిధంగా జనగాంకు చెందిన శ్రీను వాహనంలో రూ.79,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద నిర్వహించిన తనిఖీలలో రూ.1.50లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

300 కిలోల బెల్లం స్వాధీనం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో నల్లగొండ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సూర్యాపేట డీటీఎఫ్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దాడుల వివరాలను జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ వివరించారు. చింతలపాలెం మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వచేసిన 300 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటి యజమాని పరారీలో ఉన్నాడని, అదే గ్రామానికి చెందిన చిత్తలూరి లక్ష్మీ సారా విక్రయిస్తుండగా ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలంలోని అవిరేనికుంటతండా, సుల్తాన్‌పూర్‌తండా, రామచంద్రాపురం తండాల్లో దాచిన సుమారు 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలం కాలువపల్లి తండాకు చెందిన బాణోతు కోటా, బాణోతు సోముడు చౌటపల్లి గ్రామానికి 10 లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బాణోతు సోముడు పరారీ కాగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నాగార్జునరెడ్డి, రాకేష్, మల్లయ్య, శంకర్, జగన్మోహన్‌రెడ్డి, రవి, నరేష్, నాగరాజు, రుక్మారెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ, ఏప్రిల్ 2 : నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. జాల్‌తండా, గోనబోయినపల్లి, టి.గౌరారం, జేత్యతండా, పద్మట్‌పల్లితండా, మేగ్యాతండాలలో దాడులు నిర్వహించి 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురుని అరెస్ట్ చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 18 లీటర్ల నాటుసారా, 18 కేజీల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైతులకు పంట నష్టం పరిహారం ఇవ్వాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుర్రంపోడు, ఏప్రిల్ 2: కరువు కారణంగా పంటలు ఎండి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో రైతులు డిప్యూటీ తహసీల్దార్ ఫరీదుద్దీన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అమలు చేసి రుణాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరి సత్తయ్య, మట్టిపల్లి అంజనేయులు, నల్లపు శ్రీహరి, వెంకటేష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి కృషిచేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 2: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ కోరారు. శాలిగౌరారంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానికుడైన కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీ తీసుకరావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, పెరుమాండ్ల నరేష్, బోడ దానయ్య, పల్స సైదులు, టేకుల రమేష్, దేవరకొండ జయరాజు, వేముల సైదులు, రాపర్తి వెంకటేష్, యామగోని వెంకన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ నాయకుడు కిరణ్‌మాదిగ

దామరచర్ల, ఏప్రిల్ 2: రాష్ట్రంలో 30సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జాతి పేరును అడ్డం పెట్టుకొని వర్గీకరణ అంశాన్ని లేవనెత్తి మాదిగలను మోసం చేస్తూ బీజేపీకి వత్తాసు పలకడం దేనికి సంకేతమని టీఎమ్మార్పీఎస్, ఎస్టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోకల కిరణ్ మాదిగ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ బహుజన, అణగారిన కులాలకు రాజ్యాధికారాన్ని దూరం చేస్తూ వివక్షకు గురి చేశారన్నారు. రాష్ట్రంలో మాదిగ ఉప కులాలను అడ్డం పెట్టుకొని ప్రతి ఎన్నికల్లో ప్యాకేజీ సంఘంగా ఎమ్మార్పీఎస్ మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలెపల్లి ఉదయ్‌కుమార్, పోకల రవి, పోకల కిరణ్, ధీనావతఖ మెహన్‌నాయక్, పొదిల శ్రీనివాస్, ఆకారపు గోపాల్, అలంపల్లి వసంత్, నాగునాయక్, జానునాయక్, నాగయ్య పాల్గొన్నారు.

వరి పొలం పంట దిగుబడి అంచనా నమోదు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 2: జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నిరంజన్, అర్థగణాంక విభాగం శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అమ్మనబోలు గ్రామంలో పంట దిగుబడి అంచనా నివేదికన క్షేత్రస్థాయిలో తయారు చేశారు. వరి కోతలు మొదలైన నేపథ్యంలో అమ్మనబోలు గ్రామానికి చెందిన రైతులు ఎండీ. ముజాహిద్, సామ శంకర్‌రెడ్డిలకు చెందిన వరి పొలాలను పంటకోత దిగుబడి అంచనాకు ఎంచుకున్నారు. ఇద్దరు రైతుల పొలంలో ఎటూ ఐదు మీటర్ల చతురస్రంలో వెడల్పు, పొడవు సమాన కొలతల చొప్పున వరికోత చేపట్టి ధాన్యం దిగుబడి పరిమాణం ఎకరానికి ఎంత వచ్చిందో ఖచ్చితంగా అంచనా వేశారు. అంచనా వేసిన పంట దిగుబడి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు నిరంజన్ తెలిపారు. కార్యక్రమంలో అర్థగణాంక శాఖ అధికారి విజయ్‌కుమార్, జయమ్మ, మండల ఏఎస్‌వో మల్లిఖార్జున్, ఏఈవో శిరీష, రమేశ్, మహేశ్, సత్యనారాయణ ఉన్నారు.

రూ.5.2కోట్లతో ఉపాధి హామీ పనులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 2: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.5.2కోట్లు ఖర్చు చేసినట్లు ఎంపీడీవో ఉమేశ్‌చారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో రూ.3.45 కోట్లు కూలీల వేతన రూపంలో చెల్లించామని, రూ.1.57కోట్లను మెటీరియల్ కింద ఖర్చు చేశామని పేర్కొన్నారు. మొత్తం 29గ్రామ పంచాయతీల్లో 7248 కుటుంబాలకు 8857 మందికి కూలీలకు ఉపాధి కల్పించామన్నారు. వీరిలో 56 కుటుంబాలు 100రోజులు పని పూర్తిచేసుకున్నాయని తెలిపారు. 1,98,000 పని దినాలు లేబర్ బడ్జెట్ లక్ష్యం కాగా 2,0,5000 లక్షల పనిదినాలు కల్పించి 104శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. ఒక్కో ఉపాధి కూలీకి సగటున రూ.168లు దినసరి కూలీగా అందాయని తెలిపారు. ఉపాధి హామీ కింద మొత్తం 242 పనులు ప్రారంభించగా 16పూర్తిచేశామని 226 పనులు ప్రగతిలో ఉన్నాయని పేర్కొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు అందజేయాలి

చందంపేట, ఏప్రిల్ 2: గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు అందడంలేదని, పెండింగ్ వేతనాలను వెంటనే అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. మండలం ఎంపీడీవో లక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. వేతనాలు అందకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి కార్మికునికి సమాన పనికీ సమాన వేతనం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమావత్ బోజ్యా, ఇద్దయ్య, జయరాజు, సందీప్, అంజమ్మ పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా శ్రీకాంత్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీకాంత్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 2: బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా మండలంలోని మెళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన నందిపాటి శ్రీకాంత్ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మంగళవారం శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ, బీజేవైఎం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

రైతుల వివరాలు నమోదు చేయాలి



వట్టిమర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న షణ్ముకచారి

చిట్యాల రూరల్, ఏప్రిల్ 2: ధాన్యం విక్రయించే రైతుల వివరాలను కొనుగోలు కేంద్రాల్లో నమోదు చేయాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ షణ్ముకచారి అన్నారు. మండలంలోని వట్టిమర్తి, ఉరుమడ్ల, ఎలికట్టె, నేరడ గ్రామాల్లో పీఏసీఎప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. ధాన్యం తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలని నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో విజయకృష్ణ, మనీషా, రమేష్, వికాస్, బ్రహ్మాచారి, నాగరాజు, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, నరేష్, సైదులు, పెంటయ్య, శ్రీశైలం, పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఎం డి. షైసేశ్వరరావు అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు రాములమ్మ, శ్యామలా, ఏఈవో యాదగిరి, సీసీ అంజయ్య, వీవోఏ పద్మ, ఇందిరా, లావణ్య కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఊరుపక్క యాదయ్య అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కాచారం, చామలోనిబావి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు తరి ఉమారాణి, ఆడెపు రేణుక, సీసీలు రాజేశ్వరి, శేఖర్ ఉన్నారు.

కనగల్: తాగునీటి అవసరాల కోసమే ఏఎమ్మార్పీ కాల్వకు ప్రభుత్వం సాగర్ నీటిని విడుదల చేసిందని నల్లగొండ ఆర్డీవో రవి తెలిపారు. మండలంలోని కురంపల్లి వద్ద ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వను స్థానిక అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కాల్వకు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ పంపుసెట్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తక్షణ చర్యగా సదరు మోటర్లకు విద్యుత్‌సరఫరాను నిలిపివేయించారు. కాగా వేసవి తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా ప్రభుత్వం ఉదయ సముద్రం చెరువుకు నీటిని విడుదల చేసిందన్నారు. మిషన్‌భగీరథ నీటిని గ్రామాలకు సరఫరా చేసేందుకు చెరువులో నీటి నిల్వలు తగ్గిపోవటంతో ఉదయ సముద్రం చెరువుకు నీటి తరలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాగు నీటి అవసరాల కోసం ఉద్దేశించిన నీటిని అక్రమంగా కాల్వగేట్లు ఎత్తి ఇతర అవసరాలకు తరలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఐబీ డీఈ సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల: చిట్యాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ. అక్బర్ డిమాండ్ చేశారు. చిట్యాల మార్కెట్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనీ, ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోతున్నారన్నారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కె షరీఫ్, బొల్గూరి లింగయ్య, రావుల చినవెంకన్న, గుండాల సత్తయ్య, మేకల బిక్షం, కడగంచి రామలింగయ్య, బాల్‌రెడ్డి, దామనూరి అంజయ్య పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



దేవరకొండ: తాటికోల్‌లో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మర్రిగూడలో పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషిచేయాలని గౌడ, గీతా సంఘాల సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని తాటికోలులో మంగళవారం సర్వాయి పాపన్న పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కరచారి, విజయ్‌గౌడ్, కాటంగౌడ్, వీరయ్యగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గుర్రంపోడు: సర్వాయి పాపన్న వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో గుర్రంపోడులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాలి రమేష్‌బాబు, రావుల నర్సింహాగౌడ్, అయితగోని వెంకటేశం, కల్లుగీత సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అయితగోని వెంకటేశం గౌడ్, రావుల సైదులుగౌడ్, రాంబాబు, రావుల వెంకటేశ్వర్లు, అంజయ్యగౌడ్, కళ్యాణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ మాట్లాడుతూ పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కర్నాటి శివరామకృష్ణ, గుణగంటి వెంకన్న, బంటు వెంకటేశ్వర్లు, నాగరాజు, రవి, శ్రవణ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల యాదయ్యగౌడ్, మర్రిగూడ వ్యవసాయ ప్రాథమిక చైర్మన్ పందుల యాదయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, పందుల రాములు, యాదగిరి, నర్సింహ్మ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువుల మాట వింటే ఉజ్వల భవిష్యత్



మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ, ఏప్రిల్ 2: తల్లిదండ్రులు, గురువుల మాట వినే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఉద్యోగ విరమణ చేసిన స్కూల్ అసిస్టెంట్ కోమటి మధుసూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పానగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు మధుసూదన్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ కుమారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమ్మ, విద్యా కమిటీ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఆలీ, కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్య, అన్నపూర్ణ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమారి, రామనర్సయ్య, నర్మద, షేహనాజ్ బేగం, శోభ రాణి, భారతి, కృష్ణ, శంకరయ్య, జానీపాషా, బాలు, కుశల కుమారి, రాజ్యలక్ష్మి, ఆసియా, యాదయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ : మంటలతో ఇల్లు దగ్ధం



గ్యాస్ సిలిండర్ లీకేజీ మంటలతో కాలిన ఇల్లు

దేవరకొండ, ఏప్రిల్ 2: దేవరకొండ పట్టణంలోని అయ్యప్పనగర్‌లో కేతావత్ నిమ్మానాయక్ ఇంట్లో వంట గ్యాస్ లీకేజీతో మంగళవారం మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు దగ్ధమై రూ.15లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు నిమ్మానాయక్, దేవరకొండ అగ్నిమాపక అధికారి రాజు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం నిమ్మానాయక్ భార్య జ్యోతి వంట గ్యాస్ సిలిండర్‌ను ఆన్‌చేసి లైటర్‌తో వెలిగించే ప్రయత్నం చేసింది. లైటర్ రెండు, మూడు సార్లు చేసినప్పటికీ మంట రాకపోవడంతో సిలిండర్‌లో గ్యాస్ అయిపోయిందని అలాగే వదిలేసి బయటకు వచ్చింది. బయట వరండాలో ఉన్న భర్త నిమ్మానాయక్ మరోసారి సిలిండర్‌ను చూడమని చెప్పడంతో జ్యోతి సిలిండర్ వద్దకు వచ్చి లైట్ వేసింది. అప్పటికే సిలిండర్ నుంచి గ్యాస్ లీకేజీ అవుతుండడంతో ఒకేసారి ఇంట్లో మంటలు అంటుకున్నాయి. భయాందోళనకు గురైన జ్యోతి, నిమ్మానాయక్ బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలలో బట్టలతోపాటు విద్యుత్ వైర్లు, కబోడ్లు, సామాగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నిమ్మానాయక్ ఫిబ్రవరి నెలలో నూతనంగా గృహ ప్రవేశం చేశారు.

కాల్వల పనులు త్వరగా పూర్తిచేయాలి : చెరుపల్లి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

కట్టంగూరు, ఏప్రిల్ 2: అసంపూర్తిగా ఉన్న బ్రాహ్మణవెల్లెంల, ధర్మారెడ్డి కాల్వ పనులు త్వరగా పూర్తిచేసి తాగు, సాగునీరు అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. కట్టంగూరులో మంగళవారం నిర్వహించిన సీపీఎం నకిరేకల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేసే ప్రజా నాయకుడు భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ. జాహంగీర్‌ను గెలిపించాలని కోరారు. అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టి ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పోరాడారని అన్నారు. డబ్బే ప్రధానంగా ఎంచుకుని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రద్దు చేసే మతోన్మాద బీజేపీకి ఓటు వేయకూడదని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నాయకురాలు కందాల ప్రమీల, బొజ్జ చిన్నవెంకులు, గంజి మురళి, జిట్ట నగేష్, పెంజర్ల సైదులు, సరోజ, మహేష్, మారయ్య, బక్కయ్య, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

జనజాతర సభను విజయవంతం చేయాలి : బాలు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 2: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల 6వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జనజాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గం నుంచి 10వేల మందికి పైగా కార్యకర్తలతో జనజాత సభకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖర్జున ఖార్గే, అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్య అతిథులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో17పార్లమెంట్ స్థానాలనూ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికా రంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు : వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని చందంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐదు గ్యారెంటీలను అమలు చేశారన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు ఐక్యతతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నకిరేకంటి యేసుపాదం, పన్నాల రాఘవరెడ్డి వరికుప్పల వెంకటయ్య, రూపాని నర్సింహ్మ, రవి, నాగరాజు, శ్రీకాంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలపై నేతల సమీక్ష

డిండి, ఏప్రిల్ 2: డిండి బీఆర్ఎస్ మండల నేతలు ఈ నెల 4వ తేదీన సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు స్వగామం వీరబోయినపల్లిలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. డిండిలో జరిగే కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. డిండి పీఏసీఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాసరావు, తవక్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నాగార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ పుల్లమ్మ, దేవరకొండ మార్కెట్ వైస్ చైర్మన్ జంగారెడ్డి, డిండి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లయ్య, కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

'కేసీఆర్ కళాభారతి' పేరు మార్చాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 2: పట్టణంలోని మినీ రవీంద్రభారతిగా పిలిచే కళాక్షేత్రాన్ని ఎలాంటి తీర్మానం లేకుండా 'కేసీఆర్ కళాబారతి'గా బోర్డు పెట్టారని దానిని వెంటనే మార్చాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కళాక్షేత్రం నిర్మాణానికి సంబంధించిన లావాదేవీలన్నీ మినీ రవీంద్ర భారతి పేరుతోనే జరిగాయన్నారు. కళాక్షేత్ర నిర్మాణానికి మొదట కాంగ్రెస్ మాజీ ఎంపీ జైపాల్‌రెడ్డి రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. అందువల్ల దీనిని మినీ రవీంద్రభారతిగానే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, తమ్మడబోయిన అర్జున్, కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి,గంధం రామకృష్ణ, జావీద్, నాగమ్మ, ఇంద్ర కుమార్ పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి'

నకిరేకల్, ఏప్రిల్ 2: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మహబూబ్‌బాద్ పార్లమెంట్ ప్రభారి నూకల వెంకటనారాయణరెడ్డి అన్నారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనువాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు వనం వేణు, కార్యదర్శి చంద్రమోహన్, మిర్యాల యాదగిరి, కారింగు నాగరాజు, సైదులుగౌడ్, ఉపేంద్రచారి, యశ్వంత్ పాల్గొన్నారు.

కట్టంగూరు: మండలంలోని అయిటిపాముల గ్రామంలో బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పీఎం కిసాన్, రూరల్ స్కిల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్, ఉపాధి హామీ, సబ్సిడీ ఎరువులు, ఉజ్వల గ్యాస్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు పబ్బు వెంకటేశ్వర్లు, నాయకులు నీలం శ్రీరామ్, బెజవాడ సంతోష్, నాగరాజు ఉన్నారు.

చికిత్సపొందుతూ ఆశ వర్కర్ మృతి

పెద్దవూర, ఏప్రిల్ 2: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆశా వర్కర్ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గర్నెకుంట గ్రామానికి చెందిన చెరుకుపల్లి వీరయ్య ముత్తమ్మల రెండో కూతురు రజిత(36)కు అదే గ్రామానికి చెందిన బొంగరాల రామలింగయ్యతో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు కలిగిన తర్వాత భర్త రామలింగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. కుమారులను చదివిస్తూ ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న ఆమె భర్త వైద్య ఖర్చులకు, పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు అధికం కావడంతో తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందింది. ఆమెకు కుమారులు రంజిత్, లక్ష్మీకాంత్ ఉన్నారు. సొంత ఇల్లు లేని ఆమె మృతితో పిల్లలు అనాథలుగా మారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని గ్రామస్థులు, బంధువులు ఆవేదన చెందుతున్నారు.

చిట్యాల రూరల్: పెద్దకాపర్తి ఉమామహేశ్వరస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన పలువురు వితరణ చేశారు. ఏర్పుల వెంకటేశం, మల్లీశ్వరి కుటుంబ సభ్యులు మైక్‌సెట్ బహూకరించారు. గర్భగుడికి గ్రానైట్‌ను అందిస్తానని బూడిదపాక నర్సింహ తెలిపారు. నీలకంఠ నరేష్, కావ్య కుటుంబ పెద్ద గంట బహూకరించారు. దాతలను ఆలయం చైర్మన్ ఏర్పుల నర్సింహ, ఉప్పల రవీందర్‌కుమార్, మోర రాములు, కోశాధికారి నారాయణ మధుసూదన్‌గుప్త, నరేష్, మైల సత్తయ్య సన్మానించారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మతల్లి భక్తులకు వారాహిదేవిగా దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు బోననైవేద్యాలు సమర్పించి, కోరికలు నెరవేరాలని ముడుపులు కట్టారు.

అడవిదేవులపల్లి: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాలు నాయక్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పట్ల ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కంచుకొమ్ముల శ్రీనివాస్, బండి నాగేశ్వర్‌రావు, బండి నరసింహారావు, రావుల నాగేశ్వర్‌రావు, నక్కా వెంకటేశ్వర్లు, రమావత్ దస్రు, లాలునాయక్, సిపాయి, ధన్య నక్రనాయక్ పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు జగాల్‌రెడ్డి ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ సంస్థ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 6న హైదరబాద్ శారదా కల్చరల్ లైవ్ స్టూడియో శ్రీముఖి కాంప్లెక్స్ హిమాయత్‌నగర్‌లో జరిగే సమావేశంలో ఆయనకు అవార్డు ప్రదానం చేయనున్నట్టు ప్రతినిధులు తెలిపారు.

మర్రిగూడ: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చాన ధాన్యానికి రూ.500 బోనస్‌ను రైతులకు అందించాలని శివన్నగూడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ బాలం నర్సింహ డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం..

శివన్నగూడలో విలేకరులతో మాట్లాడుతూ శివన్నగూడ వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శివన్నగూడ, కుదాభక్షపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని అన్నారు. నేటి నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నందున రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి విక్రయాలు చేసుకోవచ్చని కోరారు.

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబరు 9న రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని చేయలేదని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు మహేశ్వరం వెంకన్న విమర్శించారు. మండలంలోని ఉట్కూర్‌లో విలేకరులతో మాట్లడారు. రైతులు పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చుకున్నారని సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకర్ల ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేవరకొండ: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పించాలని మర్రిచెట్టుతండా మాజీ సర్పంచ్ నేనావత్ శీనునాయక్ అన్నారు. గ్రామంలో ఉపాధిహామీ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిరుపేదలకు వరమని, రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ఉపాధి కూలీలకు టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కీర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్య ఉన్నారు.

అడవిదేవులపల్లి: మండలంలోని కొత్తనందికొండ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మాధవి, వినోజలు మాట్లాడుతూ గర్భిణులు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. రోజువారి ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

మాడ్గులపల్లి: ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో ప్రభుత్వం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీకర్, అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని పెద్ద మసీదులో సరాబు ధనుంజయ కేటరర్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సరాబు కిరణ్, జగదీష్, ఖాజాహమీదుద్దీన్, అస్లాం, అయూబ్, సమీఖాద్రి, ఇస్మాయిల్, శ్రీనివాస్, మట్టయ్య, శివయ్య ఉన్నారు.

మర్రిగూడ: పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి బీజేపీ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి యాస అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సరంపేటలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా రావుల రమేష్‌గౌడ్ ఎన్నుకున్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు రాజేందర్‌నాయక్, వెంకటంపేట శేఖర్, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: మండలంలోని వట్టిమర్తిలో నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఎంయూ ప్రాజెక్టులో భాగంగా రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఏసిహెచ్ పుల్లారావు, వైద్యులు ఆకుల శశిధర్, ఎస్‌పి రాములు, శ్రీనివాసరెడ్డి, సూరెడ్డి సరస్వతి, బుర్రి రవీందర్‌రెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, మేడి హరికృష్ణ, వెంకన్న, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నందున్న గుండ్రాంపల్లి గ్రంథాలయం సమాచార కేంద్రం నిర్వాహకుడు అనుముల శ్రీనివాస్‌ను పాఠకులు సన్మానించారు.